సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 2 । మార్చి । 2024



నాటి రామబాణం..నేటి రామతీర్థం

ఒంటిమిట్టలోని రామతీర్థం అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.రూ. 35 లక్షలతో చేపట్టిన నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. -IIలో



టీడీపీ హయాంలో అరాచకం

టీడీపీ హయాంలో అరాచకం సృష్టించారని విప్ కొరముట్ల అన్నారు. మంగంపేట ఆర్ఆర్1 గ్రామ ప్రజలకు ఇంటి హక్కు పత్రాలు ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి అందించారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	275	380
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 50.160 కిలోలు

న్యూస్‌రీల్

పింఛనానందం



వీరబల్లి మండల పరిధిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

రాయచోటి: జిల్లా పరిధిలోని 30 మండలాల్లో శుక్రవారం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర లబ్ధిదారులు జగనన్న ప్రభుత్వం అందించిన రూ. 3 వేలు పెన్షన్ చేతబట్టి ఆనందంతో ఆశీర్వాదాలను అందించారు. జిల్లా పరిధిలో 2,25,920 మందికి రూ. 67.07 కోట్లు పెన్షన్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. మార్చి ఒకటో తేదీ రాత్రి 8.50 గంటలకు 1,74,608 మందికి రూ. 3 వేలు వంతున రూ. 51.76 కోట్లు అందజేశారు. మిగిలిన వారికి కూడా రెండు, మూడు రోజుల్లో అందజేస్తామని ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, అసిస్టెంట్ పీడి ధర్మరాజులు తెలిపారు.

ఆరోగ్య సురక్ష సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని శిబ్యాల వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్యసురక్ష 2.0 శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది చేస్తున్న కంటి పరీక్షలు, రక్తపరీక్షలు, మందుల పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం గురించి వైద్యసిబ్బంది మరింతగా ప్రచారం చేయాలన్నారు. రాయచోటి రూరల్ మండల ఎంపీడీఓ సురేంద్రనాథబాబు, యండపల్లె పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి,వైద్యులు రెడ్డినరేష్, మౌనిక, ఆప్తమాలజీ అధికారిణి కల్పన, వైద్య సిబ్బంది వై.విశ్వనాథరెడ్డి, రమణమ్మ, రామచంద్ర, గంగాధర్, శిరీషా, సరస్వతి, అంజనమ్మ, శిబ్యాల వైఎస్ఆర్‌సిపి నేతలు నాగేశ్వర, షామద్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

రాయచోటి టౌన్: నైపుణ్యాలను పెంపొందించుకొంటే యువతకు స్వయం ఉపాధి లభిస్తుందని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం, ఉద్యం స్వచ్ఛంద సంస్థ వారు సంయుక్తంగా ఎంటర్ ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు వ్యవస్థాపక మనస్తత్వాన్ని పెంపొందించుకుంటే పారిశ్రామిక వేత్తలుగా ఎదగవచ్చని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 75 ప్రాజెక్టులను పరిశీలించాక ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటసుబ్బయ్య, వినయ్ కుమార్‌లు రూపొందించిన ఎయిర్ ప్యూరిఫైడ్ సంబేపల్లె మండలం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మస్తాన్, రోహిత్‌లు రూపొందించిన రెయిన్ డిక్టేటర్, క్రాప్ ప్రొటెక్టర్ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలు ఈ నెల 6వ తేదీ విజయవాడలో జరుగుతాయని తెలిపారు. ప్రతిభ చూపిన వీరికి బహుమతులు అందజేశారు.

ఐబీ సిలబస్ అమలు సంతృప్తికరం



ఐబీ విద్యా విధానం పరిశీలకులతో జిల్లా విద్యాశాఖ అధికారులు

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పాఠశాలల్లో అమలు చేస్తున్న ఐబి సిలబస్ అమలు సంతృప్తికరంగా ఉందని విదేశీ అధ్యయన పరిశీలకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, గురుకుల పాఠశాలలో, గిరిజన సంక్షేమ పాఠశాలలో అమలవుతున్న విద్యా విధానాన్ని వారు పరిశీలించారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయచోటిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను వారు పరిశీలించారు. తరువాత జిల్లా విద్యాశాఖఅధికారి కార్యాలయంలో జిల్లాలో అమలవుతున్న విద్యా విధానంపై జరిగిన సమీక్షా సమావేశంలో పాఠశాలల ప్రగతి అభ్యసన స్థాయి, పిల్లల బోధన సామర్థ్యం గురించి బృందం సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రకాష్ రెడ్డి, ఏడీ ప్రసాద్ బాబు, ఐబీ సిలబస్ రూపకల్పనలో సీనియర్ మేనేజర్ వెండిగీస్ (అమెరికా), పర్సనల్ డెవలప్మెంట్ స్పెషల్ ఆఫీసర్ ఎరిక్ బాబర్ (ఇంగ్లాండ్), ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఊతం



జగనన్న విద్యా దీవెన పథకం మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ తదితరులు

- పేదలకు వరం..విద్యాదీవెన పథకం
- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్
- జిల్లాలో 31.478 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.24.80 కోట్లు జమ

రాయచోటి: పేదరికం విద్యార్థుల చదువుకు అడ్డు కాకూడదని, వారు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా, పామర్రు నుంచి జగనన్న విద్యా దీవెన పథకం క్రింద అక్టోబర్, డిసెంబర్-2023 త్రైమాసికానికి సంబంధించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో నేరుగా జమ చేశారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్ హుస్సేన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప తదితరులు పాల్గొన్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం విద్యార్థుల అదృష్టమని జిల్లా కలెక్టర్ అన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఐటీఐ, డిప్లమా, డిగ్రీ ఆపై స్థాయి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ఈ పథకం ఒక వరం లాంటిదన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఇంతమంచి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వీసి ముగిసిన అనంతరం జగనన్న విద్యా దీవెన పథకం క్రింద జిల్లాలో అర్హులైన 31,478 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో రూ. 24,80,81,198లు మెగా చెక్కును విద్యార్థులు వారి తల్లులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీస్ శాఖ, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం

రాయచోటి : త్వరలో జరిగే సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు. శుక్రవారం 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ అంశాల్లో సిబ్బందికి ఎన్నికల శిక్షణా తరగతుల నిర్వహణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, ఎన్నికల జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు, ఇతర అంశాలలో పూర్తి చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఎంకేమీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఇంకా పరిష్కారం కానీ 13 వేల ఫామ్స్‌ను త్వరగా పరిశీలన చేసి వెంటనే సీఈఓ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. నూతనంగా ప్రింట్ అయిన ఓటర్‌కార్డులను పోస్టల్ శాఖతో సమన్వయం చేసుకొని సంబంధితులకు అందేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీలకు, మీడియా వారికి కూడా ఎన్నికలకు సంబంధించిన అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణరావు పాల్గొన్నారు.

బృహత్తరమైన పథకం....



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో జగనన్న విద్యా దీవెన అనే బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం గర్వించదగ్గ విషయం. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా ప్రదాతగా రాష్ట్ర చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించారు. విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలల్లో అధునాత వసతులు కల్పించిన సీఎంకు ధన్యవాదాలు. -ఎం హిబా, బీటెక్ ఫస్ట్ ఇయర్, శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, రాయచోటి

విద్యా దీవెన దేవుడిచ్చిన వరం....



రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యా దీవెన పథకాన్ని వరంగా భావిస్తున్నాం. ఈ పథకం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమౌంట్ మా అమ్మ అకౌంట్‌లో జమ అయింది. చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సాయం పెద్ద వరంగా భావిస్తున్నాం. -టి. లీలా కృష్ణ, బీటెక్ ఫస్ట్ ఇయర్, శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

గతంలో ఇలాంటి పథకాలు అమలు కాలేదు



జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఆర్థిక సాయం అందడంతో మా తల్లిదండ్రులకు మా చదువుకోసం ఆర్థిక భారం తగ్గింది. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి పథకాలు అమలు చేయలేదు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వమే అందిస్తుంది. పది కాలాలపాటు ఈ ప్రభుత్వమే ఉండాలి. -బి గీతాంజలీ, డిగ్రీ సెకండ్ ఇయర్, శ్రీ షిరిడీ సాయి ఉమెన్స్ కాలేజ్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

రేపటి నుంచి పల్స్‌పోలియో



రాయచోటి: జిల్లా వ్యాప్తంగా మార్చి 3న చేపట్టే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 3,4,5వ తేదీల్లో చేపట్టే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా జిల్లాలో 1,93,946 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు జిల్లా పర్యవేక్షకురాలు డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 3వ తేదీన 1602 కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేస్తారన్నారు.మూడోతేదీన పోలియో చుక్కలు వేయించుకోలేని చిన్నారులకు నాలుగు, ఐదు తేదీల్లో వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది కలిసి ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఉషశ్రీ కోరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1602 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని, మార్చి 3వ తేది ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు.హై రిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, సంచార జాతులు నివసించే ప్రాంతాల్లోని పిల్లకు పోలియో చుక్కలు వేయించేలా సంబంధిత శాఖలన్నీ సహకరించాలన్నారు. 46 మొబైల్ పోలింగ్ కేంద్రాలు, 45 ట్రాన్సిట్ పాయింట్లలో 161 రూట్ సూపర్ వైజర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం పల్స్ పోలియో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సిరికల్చర్ రీలింగ్ యూనిట్లు కేటాయింపు

- అర్హులకే సిరికల్చర్ రీలింగ్ యూనిట్లు కేటాయింపు
- డిస్ట్రిక్ట్ సిరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి



జిల్లా సిరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడుతున్న పునీత్‌కుమార్

మదనపల్లె: పట్టణంలోని సిరికల్చర్ కాలనీలో రీలింగ్ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తుచేసుకున్న లబ్ధిదారుల్లో అర్హులకు మాత్రమే లీజు అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేస్తున్నామని డిస్ట్రిక్ట్ సిరికల్చర్ ఆఫీసర్(డీఎస్వో) రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రీలింగ్ యూనిట్ల లీజు అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్‌కు మదనపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షులు పునీత్‌కుమార్ కొంతమంది రీలర్లతో కలిసి రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ డీఎస్వోతో వాగ్వాదానికి దిగారు. సిరికల్చర్ అధికారులు రీలింగ్‌యూనిట్లకు ఎంపికచేసినవారిలో అనర్హులు ఉన్నారంటూ, దీనిపై తాము ఇప్పటికే కోర్టును ఆశ్రయించామని, రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని కోరారు. దీనిపై డీఎస్వో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ...మదనపల్లె రీలింగ్ కాంప్లెక్స్‌లో 11 ప్లాట్స్ ఖాళీగా ఉండటంతో కొందరు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, వారిలో అర్హులను ఎంపికచేస్తూ సిరికల్చర్ కమిషనర్ జాబితా పంపుతూ.. క్షేత్రస్థాయిలో విచారణ చేసి రిజిస్ట్రేషన్ చేయాలని తనను ఆదేశించారన్నారు. అందులో భాగంగా తాను మదనపల్లె తహసీల్దార్‌ను కలిసి ఎంపికైన వారి రెసిడెన్స్ సర్టిఫికెట్లు తీసుకోగా, అందులో ఇద్దరు అనర్హులుగా తేలిందన్నారు. మిగిలిన వారు స్థానికులుగా తేలడంతో రిజిస్ట్రేషన్ చేయించేందుకు మదనపల్లెకు వచ్చానన్నారు. రీలింగ్ యూనిట్లు... రీలింగ్ పనిలో అనుభవం ఉన్న వ్యక్తులతో పాటు నిరుద్యోగులకు కేటాయింపులు జరపవచ్చన్నారు. దీనికి దరఖాస్తు చేసుకుని, అర్హతలు సాధించిన వ్యక్తులు 25శాతం మెషినరీ డబ్బులు చెల్లించడంతో పాటుగా ప్రతినెలా రూ.1,500 కిరాయి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10 ఏళ్లకు లీజు అగ్రిమెంట్ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటి నుంచీ 5నెలల్లోపు కేటాయించిన ప్లాట్స్‌లో షెడ్‌లు నిర్మించి, రీలింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలన్నారు. లేనిపక్షంలో ఆరోనెలలో లీజు అగ్రిమెంట్ రద్దవుతుందన్నారు. 1991లో మదనపల్లెలో సిరికల్చర్ కాలనీ ఏర్పాటైందని, దీనిలో చాలామంది అనర్హులు ఉన్నారన్న విషయమై, తమకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సమగ్రంగా విచారణ జరిపి 15రోజుల్లోపు సిరికల్చర్ కమిషనర్‌కు నివేదిక అందిస్తామన్నారు. అలాగే.. కాలనీలో మిగిలిన స్థలాలు కేటాయింపుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపి చర్యలు తీసుకుంటామన్నారు.

అవకాశవాదానికే అందలం..!

- టీడీపీ జెండాను నమ్ముకుంటే నట్టేట మునగడమే..
- పులివెందులలో 27ఏళ్లు అన్నీతానై పార్టీ నడిపినా...
- అవమానం, ఛీదరింపులతో దూరమైన సతీష్‌రెడ్డి
- టీడీపీకి దూరం కానున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి



సతీష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: కార్యకర్తలకు పసుపు జెండా అండగా నిలిచేది.. ఇది ఒకప్పటి మాట. కాలక్రమేణ అధినేత చంద్రబాబు సహజసిద్ధమైన అవకాశవాదం ఆచరణలో చూపెట్టారు. దీంతో పల్లకి మోసే బోయిలుగా తెలుగుతమ్ముళ్లను చూస్తున్నారు. స్థాయితో నిమిత్తం లేకుండా నాయకులను కరివేపాకు చందంగా వాడుకుంటున్నారు. టీడీపీ జెండాను చిత్తశుద్ధితో నమ్ముకున్నా, కష్టకాలంలో పోరాటం చేసినా అవేవి ప్రామాణికంగా నిలవలేదు. అవసరాలకు అనువైన వారిని ప్రోత్సహిస్తూ సీనియారిటీని విస్మరిస్తున్నారు. టీడీపీని నమ్ముకుంటే నట్టేట మునగడమేనని రుజువు చేస్తున్నారు. పాతరోజుల్లో పులివెందులలో టీడీపీ జెండా పట్టడడం బహు అరుదుగా ఉండేది. అలాంటి చోట ఏకంగా 27 ఏళ్ల టీడీపీ ఉన్నతి కోసం ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి కష్టపడ్డారు. గెలిచే అవకాశం లేదని తెలిసి, ఐదు టర్మ్‌లు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే టీడీపీ కోసం శక్తిమేరకు వీరోచిత పోరాటం చేశారు. అలాంటి నాయకుడికి టీడీపీలో నిరాదరణ ఎదురైంది. మరోవైపు నారా లోకేష్ నేతృత్వంలో అవమానాలు చవి చూశారు. పులివెందుల టీడీపీ ఉన్నతికి పనిచేసిన సతీష్‌రెడ్డి ఆ పార్టీ నుంచి స్వచ్ఛందంగా నిష్క్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాంటి పరిస్థితే మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డికి పట్టింది. 25ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేశారు. 1999 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. రాయచోటి ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీగా పోటీ చేసి, ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా టీడీపీ అభివృద్ధికి విశేష కృషి చేశారు . ఒకదశలో అధినేత చంద్రబాబు సైతం ప్రశంసించారు. తీరా అభ్యర్థులు ఖరారు నాటికి రమేష్‌రెడ్డిని పక్కన పెట్టేశారు. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు చేశారు. ఎంతటి నాయకుడైనా సరే, వాడుకోవడం వదిలేయడంలో చంద్రబాబును మించిన నాయకుడు మరొకరు లేరని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

▶▶నమ్మి వస్తే ఉన్న ఉద్యోగం పోయా...

ఇరిగేషన్‌శాఖలో డీఈగా పనిచేస్తున్న రోశన్న టీడీపీ అభ్యర్థిత్వం కోసం ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇప్పుడు ఆ సీటు జనసేన-బీజేపీ అంటూ దోబుచులాడుతోంది. అంతకు ముందు 2019లో డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్ ఉద్యోగాన్ని వదిలి టీడీపీ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. ఐదేళ్లకు ఆయన్ను పక్కకు నెట్టేసి, ఆస్థానంలో రోశన్నను తీసుకొచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మి ఉద్యోగానికి రాజీనామా చేస్తే ఇప్పటికీ అభ్యర్థిత్వం ఖరారు కాలేదు. అవుతుందో, లేదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. డాక్టర్ రాజశేఖర్ పరిస్థితి భవిష్యత్‌లో రోశన్నకు రాదన్న గ్యారెంటీ లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అలాగే కడపలో కష్టకాలంలో టీడీపీ జెండాను ఎత్తుకున్న సీనియర్ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్, అమీర్‌బాబుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. క్షేత్రస్థాయిలో పార్టీ ఉన్నతికి కృషి చేసినా అనూహ్యంగా ఆ స్థానంలోకి మాధవీరెడ్డిని తెరపైకి తెచ్చారు. అలాంటి పరిస్థితి తంబళ్లపల్లెలోనూ నెలకొంది. ఎవరూ లేరనుకున్నప్పుడు బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడిన శంకర్‌యాదవ్‌ను తీసుకొచ్చారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో ఓడిపోయినా టీడీపీ ఉన్నతి కోసమే పనిచేశారు. నారా లోకేష్, చంద్రబాబు కార్యక్రమాలను సైతం శంకర్ యాదవ్ ద్వారా చేయించారు. అభ్యర్థిత్వం ఖరారు నాటికి పార్టీ కోసం ఏమాత్రం కష్టపడని సంబంధం లేని జయచంద్రారెడ్డి ప్రత్యక్షమయ్యారు. ఇవన్నీ పరిశీలిస్తే అవకాశవాదమే చంద్రబాబు విధానంగా స్పష్టమవుతోందని పరిశీలకులు భావిస్తున్నారు.

టీడీపీకి భారీ షాక్

- 1000 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ గెలుపునకు అంకితభావంతో పనిచేస్తామని వెల్లడి



పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల



పార్టీ కార్యాలయానికి విచ్చేసిన టీడీపీ కార్యకర్తలు

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. తెలుగుదేశం పార్టీకి చెందిన 1000 కుటుంబాలు శుక్రవారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఓబనపల్లె పంచాయతీలోని ఓబనపల్లె, బయనపల్లె, సింగిరివారిపల్లె, ఎర్రమిట్ట కాలని, ఒ.కొత్తపల్లి, వడ్డిపల్లె, అరుందతి వాడ గ్రామాల నుంచి కస్తూరి ధనుంజయనాయుడు, పోతిన శ్రీనాథ్, కస్తూరి సుబ్బరాయుడు తదితరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రతి ఎన్నికల్లో టీడీపీకి ఈ పంచాయతీ అత్యధిక ఓట్లు అందిస్తూ వచ్చేది. ఇక్కడ నుంచే 1000 కుటుంబాలు టీడీపీ, జనసేన నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరడంతో టీడీపీలో గుబులు రేగుతోంది. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ తాము కొన్నేళ్లుగా టీడీపీలో ఉండి నిజాయితీగా పార్టీ అభివృద్ధికి కృషి చేశామని, అయినా తమకు ఎలాంటి గుర్తింపు లేకపోవడం, చంద్రబాబు ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చకోవడంతో తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉందని, సంక్షేమ కార్యక్రమాలతో పాటు వెనుకబడిన వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పదవులతో పాటు రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో పార్టీ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తామని వారు తెలియజేశారు. గత ఎన్నికల కన్నా ఎక్కువ మెజార్టీతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులను, ఎంపీ మిథున్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో రైల్వేకోడూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సమాజం కోసం, గ్రామాల కోసం పనిచేసే ఇలాంటి కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరడం వల్ల పార్టీ అభివృద్ధి చెందుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. పార్టీకి కార్యకర్తలే కొండంత బలం అని, వారిని ఆదుకోవడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కలసికట్టుగా కృషిచేసి పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఏపిటీడీసీ డైరెక్టర్లు మండల నాగేంద్ర, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డిలు, ఏపి టూరిజం జిల్లా డైరెక్టర్ సుదాకర్‌రాజు, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, ఎల్‌వి.మోహన్‌రెడ్డి, సిహెచ్.రమేష్, మలిశెట్టి వెంకటరమణ, నాగుల నాయుడు, ప్రతాప్‌రెడ్డి, ఉపేంద్ర నాయుడు, కస్తూరి హరినాథ్, కాకర్ల వెంకట శివ, తుంగ జయశంకర్ క్రిష్ణ, యేదోటి హరి, గంగయ్య, సాయిక్రిష్ణ , నరేంద్ర, భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులు

రాయచోటి: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం జిల్లాలో 54 పరీక్ష కేంద్రాల్లో 14,194 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. వీరిలో 13,528 మంది హాజరు కాగా 666 మంది గైర్హాజరయ్యారు. దీంతో 95 శాతం విద్యార్థులు పరీక్షలు రాసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖఅధికారి కృష్ణయ్య చెప్పారు. అలాగే ఒకేషనల్ పరీక్షకు 1298 మందికి 1181 మంది శుక్రవారం పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలలో 54 మంది చీఫ్ సూపరింటెండెంట్, 54 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 9 మంది కస్టోడియన్స్, స్క్వాడ్ అసిస్టెంట్, చీఫ్ సూపరింటెండెంట్‌లు పరీక్షలను పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శనివారం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 15056 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారు.

నాటి రామబాణం.. నేటి రామతీర్థం

- నాగేటి తిప్పపై పార్వేటి మండపం ఆధునికీకరణ
- రామతీర్థం ప్రాశస్త్యాన్ని గుర్తించిన టీటీడీ
- ముమ్మరంగా తీర్థం అభివృద్ధి పనులు..

ప్రాంతం	రూ.వ్యయం
రామతీర్థం	రూ.35లక్షలు
పారువేట కొండ	రూ.60లక్షలు




రామాలయం పడమరవైపు ఉన్న నాగేటితిప్ప నూతనంగా టీటీడీ నిర్మించిన పారువేటకొండ నిర్మాణం, టీటీడీ చేపట్టిన రామతీర్థం జీర్ణోద్ధరణ పనులు

రాజంపేట : పశువులు, పక్షుల దాహం తీర్చేందుకు సీతమ్మ కోరిక మేరకు.. రాముడు వదలిన బాణంతో నీరు పైకి ఉబికింది. నీరు పైకి వచ్చింది. ఆ నీటి బుగ్గలే నేడు రామతీర్థం.. లక్ష్మణ తీర్థంగా పిలుస్తున్నారు. ఏప్రిల్ మాసంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు చేపడుతున్న నేపథ్యంలో టీటీడీ ఇక్కడ అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో టీటీడీ చైర్మన్లు వైవీ.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి రామతీర్థం వైభవం చాటి చెప్పేలా రూ. 35 లక్షలతో చేపట్టిన నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి.

ఆలయ ప్రాశస్త్యం

త్రేతాయుగంలో దండకారణ్యంలో సీత,రామ,లక్ష్మణులు నివసిస్తున్నపుడు పశువులు, పక్షులు దప్పిక తీర్చుకోవడం ఎలా అంటూ సీత, రాముడుని అడిగిందని, సీతమ్మ కోరిక మేరకు.. రామ, లక్ష్మణులు బాణం సంధించి భూమిలోకి వదిలాడు. నీరుపైకి ఎగజిమ్మింది.. ఆ ప్రదేశంలో ఏర్పడిన వాటినే నేడు రామ, లక్ష్మణ తీర్థాలుగా పిలుస్తున్నారని భక్తుల నమ్మకం. పూర్వం ఈ తీర్థంలో స్నానం చేసిన తర్వాత స్వామిని దర్శించుకునేవారు. కొన్ని దశాబ్దాల కిందట సారంగపాణి అనే ప్రధాన అర్చకుడు ఈ నీటితో ఏకశిలమూర్తులకు అభిషేకం నిర్వహించారని, ఈ నీటిని తాగితే రోగనివారణ అవుతుందని పూర్వీకులు చెబుతారు. ఈ ప్రాంతాన్ని కంపరాయలు సందర్శించిన క్రమంలో ఈ బుగ్గనలో నీటిని తాగే ఆలయానికి, అటు చెరువుకు మధ్య ఆలయ నిర్మాణానికి అంకుర్పారణ చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో చక్రస్నానం, అంకుర్పారణ రామతీర్థంలోనే నిర్వహిస్తున్నారు. దీంతో ఇప్పుడు రామతీర్థం చుట్టూ టీటీడీ కంచె వేసింది.

పారువేట కొండకు మహర్దశ

రామాలయానికి పడమట వాయవ్యంగా మరొక చిన్న కొండ(నాగేటితిప్ప) కనిపిస్తుంది. ఈ కొండ మీద స్వామికి పారువేట ఉత్సవం నిర్వహిస్తారు. సంక్రాంతి తర్వాత కనుమ రోజున సాయంకాలం స్వామి విల్లంబులు ధరించి ఇక్కడికి చేరుకున్న అనంతరం పారువేటలో భాగంగా ఒక కుందేలును విడుస్తారు . అది పెరుగెత్తుకొండూ వెళ్తుంటే ప్రజలు ఆ కుందేలు కోసం వెంటబడతారు. ఈ ఉత్సవం కోసం కొండమీద మండపం ఉంది. ప్రస్తుతం ఇక్కడ శిథిలమైన పార్వేట మండపాన్ని టీటీడీ రూ.60 లక్షలతో తీర్చిదిద్దుతున్నారు. అంతేగాక కొండపైకి వెళ్లడానికి మెట్లమార్గం నిర్మాణాలు చేపట్టారు.

ఒంటిమిట్టకు మహా వైభవం



ఒంటిమిట్ట రామాలయానికి మహా వైభవం సంతరించుకుంది. టీటీడీ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట పుణ్యక్షేత్రం భాసిల్లుతోంది. చరిత్రాత్మకమైన రామతీర్థం పరిరక్షణ తోపాటు అభివృద్ధి చేయడం అవసరం. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ చైర్మన్లు వైవీ.సుబ్బారెడ్డి నుంచి నేటి భూమన కరుణాకర్‌రెడ్డిల హయాంలో ఒంటిమిట్ట రామాలయాన్ని నూతన శోభ సంతరించుకుంటోంది.

– మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

రామతీర్థం ప్రాశస్త్యం తెలియజేయాలి



త్రేతాయుగంలో ఏకశిలానగరం (ఒంటిమిట్ట)లో రాముడు, లక్ష్మణుడు వేసిన బాణంతో పాతాళగంగను పైకి తీసుకొచ్చి సీతమ్మ దప్పిక తీర్చిన నీటిబుగ్గ ప్రాంతమే రామతీర్థం. ఆ ప్రాశస్త్యం నేటి తరానికి తెలియజేయాలి. టీటీడీ రామతీర్థం అభివృద్ధి చేసేందుకు నడుంబిగించడం ప్రశంసనీయం. పూర్వం ఈ నీటితో స్వామికి అభిషేకం చేసేవారు. ఈ నీటితో రోగనివారణ జరిగేదని భక్తులు నమ్మేవారు.

– పసుపులేటి శంకర్, పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు, ఒంటిమిట్ట

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనలో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బి కొత్తకోట మండలం బడికాయలపల్లె పంచాయతీ చెరువు ముందర పల్లెకు చెందిన భాస్కర్ దంపతులు కుటుంబ సమస్యలతో గొడవపడ్డారు. తల్లిదండ్రులు గొడవ పడుతున్నారనే కారణంతో మనస్తాపం చెంది భాస్కర్ కుమార్తె (17) పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మరో ఘటనలో ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన శివకుమార్ భార్య పి.దీప (25) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా సోంపల్లి కు చెందిన హరూన్‌భాషా భార్య ఎస్.నూర్జహాన్ (40) అనారోగ్యం భరించలేక గాజు పెంకులు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

మద్యం స్వాధీనం

ములకల చెరువు : మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని వేపూరికోటలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా, కిష్టప్ప 14 మద్యం సీసాలు అక్రమంగా విక్రయిస్తూ పట్టుబడ్డారని తెలిపారు.

మల్లయ్య కొండకు నిప్పు



కాలిపోయిన అడవి

తంబళ్లపల్లె : మల్లయ్యకొండ అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. సుమారు 500 హెక్టార్లలో అడవి దగ్ధమైంది. పలు రకాల వృక్షాలు, ఔషధ మొక్కలు, క్రిములు, కీటకాలు, పక్షులు, జంతువులు అగ్నికి ఆహుతయ్యాయి. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతోనే అగ్నికి ఆహుతున్నాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మఒడి వరం లాంటిది



మేము బద్వేల్‌పట్టణంలోని రజక వీధిలో నివసిస్తున్నాం. నా భర్త సురేష్ పెయింటింగ్ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. నా కుమారుడు సుశాంత్ జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువు తున్నాడు. గతంలో బాబు చదువుకు సంబంధించిన పుస్తకాలు, ఇతర వస్తువులకు వేలల్లో డబ్బు ఖర్చయ్యేది. ఈ పరిస్థితుల్లో సీఎం జగనన్న వచ్చాక ఏటా అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేల సాయం మాకెంతో ఆసరాగా నిలుస్తోంది. గతంలో కంటే బడి రూపురేఖలు మారాయి. కార్పొరేట్ స్కూళ్ల తరహాలో బడిని మార్చేశారు. జగనన్న అందిస్తున్న సాయం మరువలేనిది.

– చెప్పలి సునీత, రజకవీధి, బద్వేల్

జగనన్న ప్రభుత్వంలోనే ఇంటి నిర్మాణం



జగనన్న ప్రభుత్వంలోనే ఇల్లు మంజూరైంది. ఇంకో వారం, పది రోజుల్లో ఇంట్లో చేరేందుకు పనులను పూర్తి చేసుకుంటా. గతంలో నాకు మట్టి మిద్దె ఉండేది. గత ప్రభుత్వాల హయాంలో ఇల్లు మంజూరు చేయాలని ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ అర్జీలు ఇచ్చాను. అయితే మంజూరు చేయలేదు. జగనన్న ప్రభుత్వంలో ఇల్లు కావాలని అడిగితే వెంటనే మంజూరు చేశారు. దీంతో పనులను తొందరగా చేసుకుంటున్నాను. జగనన్నకు కృతజ్ఞతలు.

– రామనాథుల మరియమ్మ, గోపాయపల్లె గ్రామం, రాజుపాళెం మండలం

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లి పంచాయతీ మడికయ్యల శివాలయం వద్ద నివాసముంటున్నఎస్.బాలహుస్సేనయ్య(40) ద్విచక్ర వాహనంలో వవెళ్తుండగా, చిప్పిలి వద్ద వెనకనుంచి ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని నిమ్మనపల్లి రోడ్డుకు చెందిన జి.సునీల్ (23) ద్విచక్ర వాహనంలో వస్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం వెంగళపల్లె పంచాయతీ మల్లువారి పల్లెకు చెందిన రైతు ఏ.కృష్ణప్ప(60) ద్విచక్ర వాహనంలో చౌడేపల్లికి వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సోమల మండలం పెద్దఉప్పరపల్లికి చెందిన కారు డ్రైవర్ మునాఫ్(30) ద్విచక్ర వాహనంలో చౌడేపల్లికి వస్తుండగా పాలసముద్రం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

వృద్ధుడికి వైద్య సేవలు




వాట్సప్ గ్రూపులో వచ్చిన పోస్టింగ్, వృద్ధుడిని జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

మానవత్వం చాటిన వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె : రోడ్డు పక్కన గుర్తుతెలియని ఓ వృద్ధుడు రొప్పుతూ పడి ఉన్నాడంటూ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేయడంతో స్పందించి వైఎస్సార్‌సీపీ నాయకులు సకాలంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న సమయంలో.. వృద్ధుడి విషయం వాట్సాప్ గ్రూపులో రావడంతో చర్చ జరిగింది. ఆయన స్పందించి కొత్తపల్లె సచివాలయ కన్వీనర్ ఎం.మహేష్‌బాబు, కొత్త ఇండ్లు హబీబ్, ఖిజర్‌ఖాన్, హేమంత్‌కుమార్‌లను వృద్ధుడిని ఆదుకోవాలని సూచించారు. పోస్ట్ చేసిన సందిని నుంచి విషయం తెలుసుకుని బెంగళూరు మార్గంలోని బిస్కెట్ ఫ్యాక్టరీ వద్ద చీకట్లో పడిన వృద్ధుడిని 108 వాహనం సాయంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులతో మాట్లాడి...వృద్ధుడికి సేలందించి సహకరించారు. సమాచారానికి తక్షణమే స్పందించిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, కార్యకర్తలను స్థానికులు అభినందించారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

ములకలచెరువు : తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగిన సంఘటన స్థానిక మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిప్పేస్వామి కథనం మేరకు... స్థానిక కదిరి రోడ్డుకు చెందిన బాల్రెడ్డి గురువారం రాత్రి వ్యవసాయ పొలం వద్దకు పడుకోవడానికి వెళ్ళాడు. ఆయన భార్య లక్ష్మీదేవి పుట్టింటి కోసం సత్యసాయి జిల్లా గాండ్లపెంటకు వెళ్ళింది. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. అనంతరం బీరువాలో ఉన్న రూ.1.30 లక్షల బంగారు నగలు చోరీ చేసుకుని వెళ్లారు. పొలం వద్ద నుంచి ఉదయం ఇంటికి వచ్చిన బాల్రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించాడు. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం సైతం పగలగొట్టి ఉండడాన్ని చూశాడు. బీరువాలో బంగారు నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ తిప్పేస్వామి సంఘటన సహాయం చేరుకుని స్థానికులు విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

టీడీపీ హయాంలో అరాచకం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



ఇంటి హక్కు పత్రాలు అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : టీడీపీ హయాంలో మంగంపేటలో అరాచకం సృష్టించారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సచివాలయం ప్రాంగణంలో మంగంపేట ఆర్‌ఆర్1 గ్రామ ప్రజలకు ఇంటి హక్కు పత్రాలు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డితో కలిసి శుక్రవారం అందజేశారు. అనంతరం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మంగంపేటలో టీడీపీ హయాంలో పీఎస్‌డీ డీపాజిట్ నిబంధనల పేరుతో వందలాది ఫల్వరైజింగ్ మిల్లులు(చిన్న పరిశ్రమలు) మూతపడి వేలాదిగా జీవనోపాధి కోల్పోయారన్నారు. కాలుష్య గ్రామాల తరలింపు అంశంపై నిరసన తెలుపడానికి వస్తే పోలీసులతో అరెస్టు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో ప్రోటోకాల్ ప్రకారం తనను స్టేజిపైకి అహ్వానించకుండా అవమానించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలూష్య గ్రామాల తరలింపునకు దాదాపు రూ.400 కోట్లు మంజురు చేశారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంలో అందరికీ మెరుగైన పునరావాసం కల్పించామన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగంపేట అంటే ప్రత్యేక అభిమానం ఉందని, కాలూష్య గ్రామాల తరలింపు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కరించారన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి ఇంటికి సంబంధించిన హక్కు పత్రం అందజేశామని తెలిపారు. అగ్రహారం ప్రజలకు వెంటనే పరిహారం ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ కులం, పార్టీ అనే పక్షపాతం లేకుండా మంగంపేటను అభివృద్ధి పరిచామన్నారు. టీడీపీ హయాంలో అగ్రహారం గ్రామాన్ని తరలించాలని పోరాటం చేసినా పట్టించుకోలేదన్నారు. గుంతకల్లు రైల్వే బోర్డు వినియోగదారుల కమిటీ సభ్యులుతల్లెం భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మంగంపేట అభివృద్ధి చేశామని, ఎవరికైనా అభ్యంతరాలుంటే ఆధారాలన్నీ సమర్పిస్తామని తెలిపారు. అంతకు ముందు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి క్రేన్ సాయంతో భారీ గజమాలను ఎంపీ, ఎమ్మెల్యేలకు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షుడు పంజంసు కుమార్‌రెడ్డి, సీపీఓ సుదర్శన్‌రెడ్డి, ఆర్‌డీఓ మోహన్‌రావు, రాష్ట్ర నాయకులు హెమస్వర్శ, మడగలం శ్రీనివాసులు, శేషగిరిరావు,కొలూరు మధుసూదన్‌రెడ్డి, తల్లెం రమణారెడ్డి, కొలూరు నారాయణరెడ్డి, గల్లా శ్రీధర్, మినుగు సుధాకర్, హరిబాబు, ముజీబ్, వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్ పార్టీనాయకులు గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఓరుగంటి అనిల్ ,మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, గల్లా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు



గాయపడ్డ ధర్మేంద్రకుమార్

కలకడ : కలకడ సమీపంలో ఓ యువకుడు గాయాలతో అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికులు 108 సిసాయంతో ఆస్పత్రికి తరలించారు. బీహార్‌కు చెందిన వున్నగౌడ్ కుమారుడు ధర్మేంద్రకుమార్ (22) కలకడ మండలం, కోన పంచాయతీ బంగారువాండ్ల పల్లె లోని క్వారీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కోన ముస్మూరమ్మ దేవాలయం సమీపంలో పడి ఉన్నాడు. స్థానికులు సమాచారంతో కలకడ 108 సిబ్బంది శ్రీనివాసులు, వెంకటాచలపతి చికిత్స నిమిత్తం ఎర్రకోటపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు విచారణ చేస్తున్నారు.

జాతీయ అవార్డుకు ఎంపిక



కడప ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో ఉర్దూ భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి అందించే అమీరున్నీషా ఎడ్యుకేషన్ అండ్ వేల్ఫేర్ ఫౌండేషన్ సంస్థ జాతీయ అవార్డుకు కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం మూలవంక జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సత్తార్ ఫైజీ ఎంపికయ్యారు. సత్తార్ ఫైజీ ఉపాధ్యాయుడితోపాటు ప్రముఖ కవి, రచయిత కూడా. ఈయన రచించిన గజల్ పుస్తకం నషీద్‌కు ఎంపికైనట్లు సత్తార్‌ఫైజీ తెలిపారు. గత 40 సంవత్సరాల నుంచి ఉర్దూ విద్య సాహితి, సాంస్కృతిక, నాటకరంగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఈయన ఇప్పటికే జీవిత సాఫల్య అవార్డుతోపాటు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు.

ఉద్యోగాల పేరుతో అమాయకులకు ఎర

రూ.45 వేలు కట్టించుకుని గెంటేసిన వైనం



బాధితుడి ఫిర్యాదుమేరకు కంపెనీ ప్రతినిధులను విచారిస్తున్న సీఐ యువరాజ్

మదనపల్లె : దుస్తుల కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానడంతో డబ్బు చెల్లించ మోసపోయిన ఐదుగురు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కంచంవారిండ్ల గ్రామానికి చెందిన అమరనాథ్ కుమారుడు రాజశేఖర్ డిగ్రీ చదువుకుని, ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. మదనపల్లె సీటీఎం రోడ్డు బాపూజీ పార్క్ ఎదురుగా గ్రాబిజ్ ఫ్యాషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాలున్నట్లు హితుడు వి.జగదీష్ చెప్పడంతో మదనపల్లెకు వచ్చి కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. రూ.45,000 చెల్లిస్తే ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో అడిగిన మొత్తాన్ని అక్కడికక్కడే చెల్లించారు. యూనిఫామ్ కోసం మరో రూ.6 వేలు చెల్లించారు. అనంతరం కొద్ది రోజుల తర్వాత ఉద్యోగం విషయంపై తాను ప్రశ్నిస్తే... సమాధానం ఇవ్వకపోగా, మెడపట్టి బయటకు గెంటేశారన్నాడు. తాను కంపెనీ ఎదుట బాధపడుతుండగా, మరికొంతమంది వచ్చి తాము ఇలాగే మోసపోయామని ఆవేదన చెందారన్నారు. నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని మోసం చేస్తున్నారని తెలియడంతో టూటౌన్ పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశానని రాజశేఖర్ తెలిపారు. విచారణ చేసి బాధితుడికి న్యాయం చేస్తామని పోలీసులు తెలిపారు.

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరులో రెడ్డి బాషా ప్రథమ చికిత్స కేంద్రాన్ని శుక్రవారం పెండ్లిమర్రి పీహెచ్‌సీ వైద్యుడు జె.వి.ఆర్.ప్రసాద్ సీజ్ చేశారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో మందులు, సైలెన్ బాటిళ్ల ఉండడంతో సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రాణం తీసిన ఇనుప కడ్డీ




ఇనుప కడ్డీ తగిలిన హరీష్



హరీష్(ఫైల్)

గుర్రంకొండ : జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రోడ్ స్టాపర్‌కున్న ఇనుప కడ్డీ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన గుర్రంకొండలో శుక్రవారం జరిగింది. స్థానికులు.. పోలీసుల కథనం మేరకు.. ఎన్‌హెచ్ 340 రోడ్డుపై వేగంగా వెళ్లే వాహనాలను అదుపు చేయడానికి స్థానిక మార్కెట్ యార్డు సర్కిల్ వద్ద స్టాపర్లను ఏర్పాటు చేశారు. గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెకు చెందిన కొమ్మిరి హరీష్(24) కారు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మార్కెట్ యార్డు సర్కిల్ వద్ద నున్న ఓ హోటల్ ముందు నిలబడి ఉన్నాడు. ఇక్కడే రోడ్డు స్టాపర్లు ఉన్నాయి. మదనపల్లె నుంచి రాయచోటి వెళుతున్న కారు వేగంగా వచ్చి వాటిని ఢీకొనడంతో రాడ్లు ఎగిర హోటల్ వద్ద ఉన్న హరీష్‌ను బలంగా తాకాయి. 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ హరీష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

సినీ ఫక్కీలో ఏటీఎం కార్డు చోరీ



చోరీ జరిగిన ఏటీఎం ఇదే

రాజంపేట : రాజంపేట ఎస్‌బీఐ ఏటీఎం వద్ద సినీ ఫక్కీలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నందలూరు మండలం కుంపిణీపురానికి చెందిన ఎస్. రాజేశ్వరి తన ఏటీఎం కార్డుతో నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ఏటీఎం వద్దకు వచ్చింది. ఆమెకు డ్రా చేసుకోవడం చేతకాకపోవడంతో ఓ వ్యక్తిని ఆశ్రయించింది. ఆ వ్యక్తి మహిళకు నగదు విత్‌డ్రా చేయిస్తానని చెప్పి, పిన్ నెంబరు తెలుసుకున్నారు. కార్డును చోరీ చేసి పిన్ నెంబర్ తప్పు అని చెప్పి మరో కార్డు చేతిలో పెట్టి వెళ్లిపోయారు. బాధిత మహిళ ఏటీఎం కార్డుతో పలు దఫాలుగా రూ.50 వేలు చోరీ చేశారు. జరిగిన మోసం తెలుసుకొని బాధిత మహిళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.